క్లుప్తంగా

విశ్రాంత అర్చకుడికి సన్మానం



సత్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అంబాజీపేట: హిందూ సంప్రదాయాలు, ఆచారాలకు విలువనిచ్చే ఏ అర్చకుడికైనా ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. చిరతపూడిలో వేంచేసిర విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకత్వం చేసి విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా కొత్తలంక సత్యనారాయణ సన్మాన సభను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణ, భాస్కరమ్మ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, సలహాదారులు, పెద్దలు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

రంజాన్ ప్రార్థనలు



మామిడికుదురు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మామిడికుదురు: రంజాన్ మాసంలోని మొదటి శుక్రవారం ప్రార్థనల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. మామిడికుదురు షియా జామియా, సున్నీ జామియా మసీదుల్లో శుక్రవారం ప్రార్థనలు ఘనంగా జరిగాయి. మత ప్రబోధకుడు షబ్బర్ అలీ జైదీ, తారిఖ్ అన్వర్ రజ్వీ శుక్రవారం ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. అల్లాకు అత్యంత ప్రీతికరమైన మాసం రంజాన్ భక్తుల కోసమే నిర్దేశింపబడిందని పేర్కొన్నారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ మండల సమావేశాన్ని శనివారం ఉదయం 9 గంటలకు గంగలకుర్రు మలుపు శేఖర్ స్వగృహం వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా బాగిత్తమ్మ సంబరం

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలో బాగిత్తమ్మ సంబరం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాగిత్తమ్మను శిరస్సు ఉంచుకుని గ్రామోత్సవం జరిపారు. అమ్మవారికి అధిక సంఖ్యలో కానుకలు, మొక్కులు చెల్లించారు. అమ్మవారి భక్తులు భక్తి పారవశ్యంతో చిందులేశారు. అమ్మవారిని పిల్లపాపలతో చల్లగా చూడాలని కొలిచారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

సఖినేటిపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమగ్రశిక్ష అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సమ్మె కాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని అంటూ ప్లకార్డులు చేతబూని పై నిరసన వారు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలనే నమ్ముకున్న తమకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని అంటూ నినదించారు. కాగా దశల వారీ ఆందోళనలో భాగంగా ఈ నెల 11న విజయవాడ కేంద్రంగా నిరసన దీక్షకు రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చినట్టు ఆందోళనకారులు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు రజినీ కుమారి, లక్ష్మీబాయి, సంధ్యాదేవి, శాంతి, కమల, శ్రీనివాస్, సాగర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి వైద్యసేవలను పర్యవేక్షించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- సింహ వాహనంపై ఊరేగిన శ్రీవారు
- ఘనంగా లక్ష కుంకుమార్చన

కొత్తపేట: ఆత్రేయపురంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాత పాతపాటి రమణరాజు, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి అలంకరణ చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలను వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విశేష పంచామృతాభిషేకం, సామూహిక లక్షకుంకుమార్చనలను రమణీయంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అష్టోత్తర శత 108 కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఐశ్వర్య ప్రాప్తికి మహాలక్ష్మి హోమం, తామరపుష్పాలతో నిర్వహించారు. ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో పాతపాటి కుటుంబ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వార్ని సింహవాహనంపై గ్రామంలో ఊరేగించారు.



రావులపాలెంలో చిన్న శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి

వైభవంగా చిన్నశేష, హంస వాహనోత్సవాలు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 16వ వార్షిక నవాహ్నిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం స్వామికి చిన్నశేష, హంస వాహనోత్సవ సేవలు నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని చిన్న శేషవాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు



ఆత్రేయపురంలో సింహవాహనంపై స్వామి వారు

వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి హంస వాహనోత్సవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఇన్‌చార్జ్ జడ్జి వి.నాగేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. కోర్టు పరిధిలోని ఆలమూరు, మండపేట, మండపేట రూరల్, కపిలేశ్వరపురం పోలీసు, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కక్షిదారులంతా కేసులు పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశాన్ని జాతీయ అత్యున్నత న్యాయ స్థానం అవకాశం కల్పించిందన్నారు. ఈ కేసుల పరిష్కారం వల్ల సమయం, సొమ్ము ఆదా అవుతుందని ఇన్‌చార్జి జడ్జి తెలిపారు.

నారీ రత్న అవార్డుకు సర్పంచ్ ఎంపిక

సఖినేటిపల్లి: మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నారీ రత్న అవార్డుకు శుక్రవారం ఎంపికయ్యారు. సర్పంచ్‌గా త్రివేణి గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా కళావేదిక పై అవార్డు ప్రకటించింది. ఈ మేరకు వేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అధ్యక్షురాలు జి.ఈశ్వర ఈ భూషణం నుంచి సమాచారం వచ్చినట్టు సర్పంచ్ త్రివేణి తెలిపారు. ఈ నెల 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు పై అవార్డును విజయవాడలో అందజేయనున్నట్టు వేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు.

3,500 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం



ఈదరాడలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న డీఏఓ బోసుబాబు

మామిడికుదురు: కోనసీమ జిల్లాలో 3,500 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. ఆయన శుక్రవారం పాశర్లపూడి, నగరం, ఈదరాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పలు పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈదరాడలో రైతులతో ముచ్చటించారు. జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 3,600 మంది రైతులు ప్రకృతి సాగు పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో ఏ విధమైన రసాయన, క్రిమి సంహారక ఎరువులు వాడకుండా పంటలు సాగు చేయడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క రైతు విధిగా విశిష్ట ఐడీ నమోదు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 2.14 లక్షల మంది రైతులు ఉండగా వారిలో 1.28 లక్షలు మంది మాత్రమే విశిష్ట ఐడీ నమోదు చేయించుకున్నారని తెలిపారు. 59 శాతం మంది మాత్రమే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులు కూడా వెంటనే విశిష్ట ఐడీ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని చెప్పారు. ఆయన వెంట జిల్లా ఏఓ శ్రీనివాస్, మండల ఏఓ మృదుల, అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య, మహిళా రైతులు కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, కుసుమ పద్మావతి పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా కొవ్వొత్తులతో మహిళా చిత్రం



ఈదరాడలో మహిళ రూపంలో కొవ్వొత్తులు ఏర్పాటు చేసిన విద్యార్థులు

మామిడికుదురు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కొవ్వొత్తులతో మహిళ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ చిత్రం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గైడ్ డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ సహకారంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. కొవ్వొత్తులతో మహిళ చిత్రాన్ని రూపొందించి, దాని చుట్టూ నిలుచుని విద్యార్థులు సందడి చేశారు. దీపాల వెలుగులతో విమెన్స్ డేకు విద్యార్థులు వినూత్నంగా స్వాగతం పలికారు. దీన్ని రూపొందించిన విద్యార్థులను హెచ్ఎం జి.సాయిబాబు, పాఠశాల టీచర్లు అభినందించారు.

తొండవరంలో..

అంబాజీపేట: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని హెచ్ఎం పి.వి.కేశవచార్యులు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఎం.రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైపాస్ నిర్వాసితుల ధర్నా

మామిడికుదురు: పాశర్లపూడి కైకాలపేటలో 216వ నంబర్ జాతీయ రహదారి నిర్వాసితులు శుక్రవారం ధర్నా చేశారు. చట్టవిరుద్ధంగా చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. 2014లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండానే 2016లో మరో గెజిట్ విడుదల చేశారని ఆరోపించారు. ఇది చట్ట విరుద్ధమన్నారు. బైపాస్‌రోడ్డుపై ఇప్పటికే హైకోర్టులో 60 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. జాతీయ రహదారుల శాఖ అధికారులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా నెట్టుకొస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. 2016లో విడుదల చేసిన గెజిట్ వల్ల ఎంతో మంది పేదలు ఇళ్లు కోల్పోతున్నారని వాపోయారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ ధర్నాలో నిర్వాసితులు గెడ్డం గంగాధర్, చొల్లంగి ధర్మరాజు, బండారు సరయ్యకాపు, నైనాల సత్యమూర్తి, గెడ్డం కృష్ణమూర్తి, గెడ్డం సావిత్రి, కోటం ధనలక్ష్మి, గెడ్డం నర్సయ్య, మంద సరస్వతి, చుట్టుగుళ్ల సీత తదితరులు పాల్గొన్నారు.



పాశర్లపూడిలో ధర్నా చేస్తున్న బైపాస్ రోడ్డు నిర్వాసితులు

గ్రామాభివృద్ధికి సహకరించండి

ఆలమూరు: స్థానికంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ లంక వర ప్రసాదరరావు నేతృత్వంలోని ఎంపీటీసీలు యర్రంశెట్టి మంగాదేవి, బావిశెట్టి తాతాజీ కోరారు. మండలంలోని మూలస్థాన అగ్రహారంలో డీఎల్‌పీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎ.రాజు శుక్రవారం పర్యటించారు. స్థానిక రామాలయం వెనుక ఉన్న సుమారు ఐదెకరాల చెరువు పూడికతో నిండిపోవడంతో నీరు నిల్వ చేసే మార్గం లేక చిట్టడవిని తలపించే విధంగా తయారైందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఏటిగట్టు ర్యాంపు తీవ్రంగా దెబ్బతినడం వల్ల రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, అనేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అలాగే సరైన సౌకర్యాల కల్పన లేక ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న స్థానిక శ్మశానవాటికను అన్ని విధాలా మండల ప్రజా పరిషత్ నిధులతో అభివృద్ధి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన డీఎల్‌పీఓ రాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, నిధుల మంజూరుపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ కార్యదర్శి చిక్కాల వీరమాత, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్

అయినవిల్లి: మండలంలో జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, జిల్లా చైల్డ్ లేబర్ ఆఫీస్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిచారు. మండలంలో ముక్తేశ్వరం, అయినవిల్లి తదితర గ్రామాల్లో టిఫిన్, భోజనం హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, బట్టల షాపులు, ఇటుకబట్టీలు మొదలైన దుకాణాల్లో బాల కార్మిక వ్యవస్థ గురించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో లేబర్ ఆఫీసర్ ఎ.విజయప్రకాష్ మాట్లాడుతూ చిన్న పిల్లలను అనగా 14 ఏళ్ల లోబడి ఉన్న వారిని మీ షాపుల్లో పనికి పెట్టుకోకూడదని, అలా పెట్టుకున్నట్టయితే బాలల హక్కుల రక్షణపై ప్రభుత్వం తీసుకునే చర్యలకు మీరు బాధ్యులవుతారన్నారు. ప్రతి షాపులో లేబర్ సర్టిఫికెట్లు డిస్‌ప్లే చేయాలని వారికి అవగాహన కల్పించారు. ఫ్లెక్సీతో ముక్తేశ్వరం సెంటర్‌లో అధికారులు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాయవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పీఎస్ కార్తీక్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ఎం.మహాలక్ష్మణ్, మండల విద్యాధికారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాలల పరిక్షణపై షాపుల వద్ద ఫ్లెక్సీతో అవగాహన కల్పిస్తున్న చైల్డ్ లేబర్ ఆఫీసర్స్

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

రాజోలు: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అన్నారు. శుక్రవారం రాజోలులో మహిళా దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. అమలాపురం ఏరియా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పి.సౌమ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి సమస్యల నివారణలతో పాటు ఆర్థిక పురోగతి సాధించే పలు మార్గాలను సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు పి.శైలజ, అశ్వనిరెడ్డి, సరిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ చంద్రబోస్, శైలజ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

అంబాజీపేట: దోమల నివారణను అరికట్టేందుకు మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం సచివాలయం-2 డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై స్థానికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అప్పారావు మాట్లాడుతూ ఇంటి వద్ద ఉన్న మురుగునీటి కాలువలు, బోదెలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తాచెదారాన్ని నివాస ప్రాంతాల వద్ద ఉంచకూడదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

రహదారి వెడల్పు చేయాలి

పి.గన్నవరం: స్థానిక ప్రధాన కాలువ నుంచి ముంగండ, మాచవరం మంచినీటి ప్రాజెక్టులకు వెళ్లే పైపు లైన్లకు ఇబ్బందులు లేకుండా ఏజీ రోడ్డు అభివృద్ధి పనులు నిర్వహించాలని ప్రాజెక్టుల పరిధిలోని సర్పంచ్‌లు, నాయకులు శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఏజీ రోడ్డులో పోతవరం వద్ద సుమారు 360 మీటర్ల మేర రహదారి తరచూ కుంగిపోతున్న విషయం విదితమే. దీంతో ఆ ప్రాంతంలో సుమారు మీటరు లోతున రహదారిని తవ్వి లైమ్ స్టెబిలేషన్ పద్ధతిలో పటిష్ట పరుస్తున్నారు. రహదారి అడుగు భాగంలో 12 మీటర్ల వెడల్పున పటిష్ట పరచి, దానిపైన 7 మీటర్ల వెడల్పున బీటీ రోడ్డు నిర్మిస్తారు. అయితే అడుగు భాగంలో రహదారిని వెడల్పు పనులకు అడ్డంకిగా ఉన్న పైపు లైన్లను వెలుపలికి మార్చాలని ఆర్అండ్‌బీ అధికారులు ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పైపు లైన్లను మార్పు చేస్తే తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతాయని, పైపు లైన్లను అలాగే ఉంచి పనులు నిర్వహించాలని సర్పంచ్‌లు ఆర్అండ్‌బీ అధికారులను కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రవీంద్రబాబు, ఏఈ కల్యాణ చక్రవర్తిలతో కలిసి సర్పంచ్‌లు శుక్రవారం పైపులైన్లను పరిశీలించారు. పరిస్థితిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్తామని సర్పంచ్‌లు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామని ఆర్అండ్‌బీ డీఈఈ జి.రాజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వడలి కొండయ్య, తోలేటి బంగారునాయుడు, శృంగవరపు లక్ష్మణరావు, కుంపట్ల నాగలక్ష్మి, తోరం వీవీ సత్యనారాయణ, నాయకులు గనిశెట్టి శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకట శివరామన్, చిన్నం బాల విజయారావు, కుసుమ వెంకటేశ్వరరావు ఉన్నారు.



పోతవరంలో ఏజీ రహదారి పక్కన పైపు లైన్లను పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్‌లు

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

ఆలమూరు: పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి టీకాలను తప్పనిసరిగా వేయించాలని స్థానిక పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు ఎల్.అనిత అన్నారు. మండలంలోని మోదుకూరులో శుక్రవారం గాలికుంటు వ్యాధి టీకాల ప్రక్రియ ప్రారంభమైంది. పశువైద్యాధికారి సుభాష్ నేతృత్వంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది 325 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ ఏడాది తొలివిడతగా నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాలను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జిల్లా రైసుమిల్లు అసోసియేషన్ కార్యదర్శి చుండ్రు శ్రీనివాసు, గ్రామ కార్యదర్శి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రావులపాలెం: ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. రావులపాలెం ఎంపీపీ కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి మామ, అలాగే మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి తండ్రి కర్రి సుబ్బిరెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను జగ్గిరెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. సుబ్బిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కొమరాజులంక సర్పంచ్ కర్రి వెంకట గోవింద కృష్ణారెడ్డి మామ గుడిమెట్ల విజయభాస్కర్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో జగ్గిరెడ్డి కృష్ణారెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రావులపాలెంలో సుబ్బిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కాశీలో ప్రారంభమైన శివనామ సంకీర్తన

కొత్తపేట: జిల్లాకు చెందిన సనాతన ధర్మప్రచార వాగ్గేయకార సంకీర్తనా వాహిని సేవాసమితి సభ్యులు కాశీ క్షేత్రంలో శివనామ సంకీర్తన సప్తాహ ధ్యాన మహోత్సవం శుక్రవారం నుంచి ప్రారంభించారు. 2015 నుంచి ప్రారంభమైన సనాతన ధర్మ ప్రచార రథ యాత్ర 2027 సంవత్సరం గోదావరి పుష్కరాలకు 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా రథయాత్ర నిర్వహణ కమిటీ ప్రెసిడెంట్, వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రం ఆస్థాన అన్నమాచార్య సంకీర్తనాచారి కరుటూరి వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండలం అంకంపాలెం, కోరుకొండ మండలం శ్రీరంగపట్నం నుంచి ఈ నెల 4న 200 మంది కాశీయాత్రకు బయలుదేరి వెళ్లిన విషయం తెలిసిందే. కాశీ క్షేత్రం గురువారం చేరుకున్నట్టు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గంగాహారతి సందర్భంగా ప్రతి భక్తుడు గంగలో స్నానమాచరించి శివనామస్మరణతో పరవశుడయ్యారన్నారు. అనంతరం కన్నప్ప మఠానికి చేరుకుని శివనామ సంకీర్తన సప్తాహ ధ్యాన మహోత్సవాలు ప్రారంభించామని శ్రీనివాసరావు తెలిపారు.